# వైద్యులయింటిచుట్టూ దెయ్యాలే

రచయిత:

దేశరాజు వీరభద్రరావు

పూర్వం కాశీలో ధనగుప్త అనే గొప్ప షాహుకారుండేవాడు. అతనిభార్యపేరు లక్ష్మీదేవి. కోస్త్రావర్తకంచేసి లక్షలకొలది ధనం గణించాడు. ఆ దంపతులకి శరీరాలు వేరైనా ఆత్మలు ఒకటిగానే వుండేవి. కష్టము దుఃఖము అనేవియెట్టివో వారెరుగరు. ఇట్లు కొంత కాలం సుఖంగా వెళ్ళబుచ్చారు. ఒకనాడు వారి యేకపుత్రుడైన ప్రభాకరుడికి హటాత్తుగా జబ్బుచేసింది. వర్తకవ్యవహారాలు చూసుకుంటూ కొట్టులోవున్న గుప్తగారికీ సంగతి తెలియలేదు. రాత్రిపొద్దుపోయేవరకూ ధనగుప్త యింటికిరాడు. ఇంటివద్దనున్న నౌకరులసహాయంతో లక్ష్మీదేవి యేదో వైద్యంచేసింది. కాని ప్రభాకరుడివ్యాధి యెక్కువ అవుతోవుందికాని తగ్గలేదు. ఆవిడ కంగారుపడి భర్తకు కబురుపంపింది. ధనగుప్తవచ్చి కుమారునిస్థితిచూసి, ఆపట్టణంలో వున్న గొప్పడాక్టరుదగ్గిరకి ప్రయాణమయ్యేడు. కొంతదూరంపోయేసరికి దారిలో ఒక సన్యాసి యెదురై 'బాబూ! నీకు తటస్థించిన కష్టమేమో నాకు తెలుసును. ఈ రుద్రాక్షమాల నీకు కొంతసహాయంచేస్తుంది. దీనిని నీవద్ద వుండనియ్యి' అని చెప్పి దానిని బలవంతంగా అంటకట్టేడు. మంత్రాలకి చింతకాయలు రాలవనే నవనాగరికుడైనా కాని, సాధువు యొక్క బలవంతంవల్ల ధనగుప్తకి రుద్రాక్షమాల తీసుకోవడం తప్పిందికాదు. ఆరోజుకిసరిపడ్డ గంజాయిఖర్చుతో సన్యాసిని బహూకరించి తనదారిని తాను పోయాడు.

డాక్టరుగారియింటికివెళ్లి చూసేసరికి కొన్ని వేలజనులు గుమ్మమువద్ద గుంపుగూడివున్నారు. ఆగుంపులో ధనవంతులు, సామాన్యులు, బీదలు—బాలురు, నడివయస్సువారు, వృద్ధులు—స్త్రీలు, పురుషులు అందరూ కలిసిపోయి, యేవిధమైన వివక్షత లేకుండా నిప్పులు కురిసేయెండలో నిలబడివున్నారు. ధనగుప్తకి దేమీ అర్థంకాలేదు. ఇన్నివేలమందీ మందుకోసమే వచ్చినరోగులై ఉండరు. ఐనా, పెద్ద చిన్న తారతమ్యము, స్త్రీపురుష వివక్షత లేకుండా అంతా కలిసివుండడం అసంభవం. తుదకు ఏమీతోచక అందులో పెద్దమనిషిలా కనబడే ఒకనిని పిలిచి సంగతేమిటని అడిగాడు. అప్పుడా పెద్దమనిషి యీ విధంగా చెప్పడం మొదలుపెట్టేడు. "అయ్యా! మేమందరమూ ఒకప్పుడు యీ డాక్టరుగారిచేత వైద్యంచేయించుకొని చనిపోయినవారి ఆత్మలము. ఈయనవద్ద మందుపుచ్చుకోకపోతే మేము ఆరోగ్యముగానే వుందుము. ఇంతమంది మృత్యువుకీ యీయనేకారకుడు. మీరు కూడా వైద్యముకోసమే వచ్చారా?" అని అడిగేడు. ఇంతలో ధనగుప్తకి సన్యాసియిచ్చిన రుద్రాక్షమాలసంగతి జ్ఞాపకము వచ్చింది. దానిశక్తివల్లనే వీళ్లనుచూసి వీళ్లతో మాట్లాడ కలిగేను అని తెలుసుకున్నాడు.

అక్కడనుంచి తిన్నగా కాశీరాజుగారి ఆస్థానవైద్యుడిదగ్గిరకి వెళ్లేడు. ఆయనగుమ్మం

వద్ద మునపటిగుమ్మంవద్దకన్న రెట్టింపుజనం వున్నారు. అక్కడనుంచి మరొకభిషగ్వరుని యింటికి పరుగెత్తేడు. అక్కడా యిల్లాగే వున్నారు. ఇంకో హకీంయిల్లుచూశాడు. అక్కడ కూడా ఈదృశ్యమే కనపడింది. ఆ పట్టణమంతా వెతికేడు. దయ్యాలగుంపులేని డాక్టరు యిల్లు కనపడలేదు. ఎవర్నో ఒకవైద్యుణ్ణి తీసుకువెళ్ళకపోతే కొడుకువ్యాధి ఎల్లాపరిణమిస్తుందో అని భయం. ఎవరిని తీసుకువెళ్ళడానికీ మనస్సు ఒప్పుకోడంలేదు.

మరొక చిన్నవీధులోకిమళ్ళి, అక్కడ ఎవరేనా డాక్టరులున్నారేమో అని చూశాడు. ఒక వైద్యశాలకనుపించింది. ఈయనగుమ్మం దగ్గిర గుంపులేదు. ఇద్దరుమాత్రం వున్నారు. సన్యాసియిచ్చిన రుద్రాక్షమాల మెడలో వుందాలేదాఅని చూసుకున్నాడు. అది యధాప్రకారం మెడలోనేవుంది. దానిమాహాత్మ్యం పోయిందేమో అని అనుమానం కలిగింది. పోతే "ఈ యిద్దరుమాత్రం యెల్లాకనుపిస్తారు? కాబట్టె వీరిద్దరి ఆయుర్దాయముతీరిపోయి వుండవచ్చును. వైద్యునివద్దకు వచ్చినవాళ్ళందరూ యెక్కడ బ్రతుకుతారు? ఎల్లాగైనా తక్కినవైద్యులకన్న ఈయన చాలా తెలివిగలవాడై యుండాలి" అని నిశ్చయించుకుని ఆ డాక్టరుగార్ని తనయింటికి తీసుకొనివెళ్ళేడు.

వీరు యింటికివెళ్ళేసరికి ప్రభాకరుడు వీధులో ఆడుకుంటూవున్నాడు. వైద్యాపేక్షలేకుండానే వ్యాధి నిమ్మళించింది. డాక్టరుగార్ని వూరికే పంపడం బాగుండదని ఫలాహారములు మొదలైనవియిచ్చి, ఆయన్ని తీసుకువచ్చిన సంగతి ఆయనతో చెప్పి, పిల్లవాణ్ణి చూపించాడు. పిల్లవాడు ఆరోగ్యంగావున్నాడు. డాక్టరుగారు వెళ్ళేటప్పుడు ధనగుప్తతో "అయ్యా! ఈ పట్టణంలో ఇంతమంది గొప్ప డాక్టర్లుండగా నన్ను యెందుకు తీసుకువచ్చారండీ" అని అడిగేడు. అందుకు ధనగుప్త "మిమ్మల్ని గురించి, మీ వైద్యప్రావీణ్యమునుగురించి ఈ పట్టణవాసులనేకవిధములచెప్పుకొని, మిమ్ము పొగడుతోవుంటారు. తక్కిన డాక్టర్లు మీకంటె గొప్పవారా?" అని ఆయన్నిసంతృప్తిపఱచాడు. కాని, డాక్టరుగారి కిది ఆశ్చర్యంగానే కనుపించింది. "నాకింతపేరు రావడానికి కారణమేమీ కనుపించదండీ. నేను మొన్ననే యీపట్టణంచేరాను. మొన్న ఒకనికి, నిన్న ఒకనికిమాత్రమే వైద్యంచేశాను. ఇంతలో నన్ను పట్టణమంతా పొగడవలసినకారణమేముంది?" అని ప్రశ్నించాడు.

ధనగుప్తుడికి వైద్యరహస్యం అర్థమైంది. ఈ డాక్టరుగారి యింటిగుమ్మంవద్దవున్న యిద్దరూకూడా దెయ్యాలే.


## నిజాము రాజ్యమునకు

వెంకట్రామా అండు కో; 3993 మార్కెట్టుస్ట్రీట్, సికిందరాబాదు.

అనువారిని ఆంధ్రభూమికి ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోష్టలు సౌకర్యములు లేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమ తమ చందాధనమును వారికి పంపుచు ఆ విషయమును ప్రత్యేకముగ మా కార్యాలయమునకు కూడ తెలుపుచుండగలరు. సికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యుల సౌకర్యార్థము వీరు మాసము మాసము ఆంధ్రభూమి విడిసంచికలు విక్రయింతురు.